సాక్షి ఖమ్మం

సోమవారం : 2 : డిసెంబర్ : 2024



కుల, మతాల పేరుతో విభజన

రాజకీయ అవసరాల కోసం కుల, మతాల పేరుతో ప్రజలను విభజిస్తున్నారని మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు అన్నారు. 8లో



సభ్యులు తిన్నాకే విద్యార్థులకు..

ప్రభుత్వ పాఠశాలల్లో భోజన లోపాలు తలెత్తుతుండగా కమిటీ సభ్యులే ముందుగా భోజనం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. 10లో

గరిష్ఠం / కనిష్ఠం
29° / 23°

వాతావరణం

జిల్లాలో సోమవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఉదయం, సాయంత్రం తేలికపాటి జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు ఉమ్మడి జిల్లాలో మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 6.30 గంటలకు హైదరాబాద్ నుంచి బయలుదేరి 10.30 గంటలకు భద్రాద్రి జిల్లా టేకులపల్లి మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్నారు. సాయంత్రం 4.30 గంటలకు నేలకొండపల్లి మండలం గువ్వలగూడెంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి, మండల లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తారు. 5.30 గంటలకు భైరవునిపల్లి, 6 గంటలకు రాయిగూడెం, 6.30 గంటలకు మంగాపురం తండా గ్రామాల్లో పర్యటించి సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తారు.

అలరించిన 'భలే మంచిరోజు'



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న కళాకారులు

ఖమ్మంగాంధీచౌక్: ఘంటసాల వెంకటేశ్వరరావు 102వ జయంతి సందర్భంగా ఆదివారం ఖమ్మం నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో నిర్వహించిన సినీ సంగీత స్వర్ణయుగ మధుర గాన వాహిని 'భలే మంచిరోజు' కార్యక్రమం అలరించింది. అదనపు డీజీపీ వి.వి.శ్రీనివాస రావు, శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ చైర్మన్ మేళ్లచెరువు వెంకటేశ్వరరావు, ఖమ్మం కళా పరిషత్ అధ్యక్షుడు నాగబత్తిని రవి, దాశరథి కృష్ణమాచార్యుల కుమార్తె ఇంద్ర, దక్షణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ రవిపాడి తదితరులు ఘంటసాల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భలే మంచిరోజు నిర్వహణ అధ్యక్షుడు డాక్టర్ టి.వాసుదేవ్, కార్యదర్శి శఠగోపం సుదర్శన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గాయనీ, గాయకులు బి.ఎ. నారాయణ, పవన్, నారాయణన్, ఐశ్వర్య, సురభి శ్రావణి, ఎస్‌వి రమణ తదితరులు ఘంటసాల పాటలు పాడి అలరించారు. ఈ సందర్భంగా దాశరథి విమర్శనాత్మక అధ్యయనాన్ని ఆవిష్కరించారు.

రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీల్లో ఖమ్మం హవా



సత్తా చాటిన ఆర్చరీ క్రీడాకారులు

ఖమ్మం స్పోర్ట్స్ : రాష్ట్రస్థాయి సీనియర్ ఆర్చరీ పోటీల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా జట్టు జైత్రయాత్ర కొనసాగించింది. హైదరాబాద్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో జరుగుతున్న ఈ పోటీల్లో తొలిరోజు జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటారు. పురుషుల విభాగం ఇండియన్ రౌండ్ పోటీల్లో కె.లక్ష్మణ్ ద్వితీయస్థానం సాధించగా, ఎం.చరణ్‌కు నాలు గోస్థానం దక్కింది. కాంపౌండ్ రౌండ్‌లో శివసాయి ప్రథమ స్థానంలో నిలిచి టైటిల్ కైవసం చేసుకున్నాడు. మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో జిల్లాకు మరిన్ని పతకాలు వస్తాయని జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షుడు సాధుల సారంగపాణి, కార్యదర్శి పుట్టా శంకరయ్య ఆశాభావం వ్యక్తం చేశారు.

జిల్లా పశువైద్యాధికారిగా వెంకటనారాయణ



ఖమ్మంవ్యవసాయం: జిల్లా పశుసంవర్ధక, పశు వైద్యాధికారిగా డాక్టర్ వెంకటనారాయణకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ శాఖ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ బి.గోపి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బి.వేణుమనోహర్ రావు ఉద్యోగ విరమణ చేయడంతో ఖాళీ ఏర్పడిన విషయం తెలిసిందే. కాగా, ఆయన స్థానంలో హన్మకొండ జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి వెంకటనారాయణను నియమించారు. ఆయనకు గతంలోనూ జిల్లాలో కొంతకాలం అదనపు బాధ్యతలు నిర్వర్తించిన అనుభవం ఉంది. వెంకటనారాయణకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

బీచ్ వాలీబాల్ ఎంపికల్లో ప్రథమ బహుమతి

దండేపల్లి: మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం రెబ్బనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-17 బాలబాలికల బీచ్ వాలీబాల్ ఎంపిక పోటీలు ఆదివారం ముగిశాయి. రాష్ట్రంలోని ఉమ్మడి పది జిల్లాల నుంచి 60 మంది క్రీడాకారులు పాల్గొనగా బాలుర విభాగంలో ఉమ్మడి ఖమ్మం జట్టు ప్రథమ బహుమతి, బాలికల విభాగంలో ద్వితీయ బహుమతులు కైవసం చేసుకున్నాయి.

విద్యార్థులు తక్కువ.. హాజరు ఎక్కువ !

- ఎస్సీ, బీసీ సంక్షేమ హాస్టళ్లలో పక్కన పడేసిన బయోమెట్రిక్ మిషన్లు
- వసతి గృహాల్లో మాన్యువల్‌గానే హాజరు నమోదు
- గిరిజన సంక్షేమ శాఖలో 'యాప్' ఉన్నా లేనట్టే
- ఇదే అదనుగా ఖజానాకు గండి కొడుతున్న ఉద్యోగులు



ఎస్సీ సంక్షేమ శాఖ హాస్టల్‌లో బయోమెట్రిక్ మిషన్‌తో హాజరు నమోదు చేస్తున్న ఉద్యోగి (ఫైల్)

జిల్లాలో శాఖల వారీగా హాస్టళ్లు, విద్యార్థుల సంఖ్య

శాఖ	ప్రీ మెట్రిక్ హాస్టళ్లు	విద్యార్థుల సంఖ్య	పోస్ట్‌మెట్రిక్ హాస్టళ్లు	విద్యార్థులు
ఎస్సీ సంక్షేమ శాఖ	41	3,263	11	1,549
బీసీ సంక్షేమ శాఖ	22	1,802	11	1,064
గిరిజన సంక్షేమ శాఖ	08	894	11	2,200

ఖమ్మంమయూరిసెంటర్: ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాల్లో విద్యార్థుల హాజరు నమోదులో అంతులేని నిర్లక్ష్యం కనిపిస్తోంది. విద్యార్థులు లేకున్నా హాజరు నమోదు చేస్తూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ శాఖల ఆధ్వర్యంలో ప్రభుత్వం సంక్షేమ వసతిగృహాలను నిర్వహిస్తోంది. ఆయా హాస్టళ్లలో ఉంటూ చదువుతున్న విద్యార్థులకు సకల సౌకర్యాలతో కూడిన వసతితోపాటు భోజన సదుపాయం కల్పిస్తున్నారు. అయితే ఆయా శాఖల్లోని కొంతమంది వార్డెన్లు విద్యార్థులు లేకున్నా హాజరు నమోదు చేసుకుని బిల్లులు డ్రా చేసుకుంటున్నారనే చర్చ జరిగింది. దీనిపై ఆరోపణలతోపాటు ఫిర్యాదులు కూడా రావడంతో గత ప్రభుత్వం సంక్షేమ వసతిగృహాల్లో విద్యార్థుల హాజరు నమోదు కోసం బయోమెట్రిక్ విధానాన్ని తీసుకొచ్చింది. అయితే మూడు నాలుగేళ్లపాటు వీటిని అడపాదడపా వాడినా ఈ ఏడాది పూర్తిగా పక్కన పడేశారు.

మాన్యువల్‌గా హాజరు తీసుకుని ఆన్‌లైన్‌లో వార్డెన్‌లే నమోదు చేసుకుంటున్నారు.

గత ఏడాది వరకు ఎస్సీ శాఖలో..

సంక్షేమ వసతిగృహాల్లో విద్యార్థుల హాజరు నమోదు కోసం బయోమెట్రిక్ విధానాన్ని ఎస్సీ సంక్షేమ శాఖ నాలుగేళ్ల క్రితం తొలిసారి తీసుకొచ్చింది. తొలి ఏడాది పైలట్ ప్రాజెక్టు కింద అంతంతమాత్రంగానే హాజరు నమోదు చేసినా.. ఆ తర్వాత కరోనా కారణంతో ఈ విధానాన్ని పక్కన పెట్టారు. గత ఏడాది సైతం జిల్లాలోని ఒకటి, రెండు వసతిగృహాలు మినహా అన్నింటిలో అంతంతమాత్రంగానే హాజరు నమోదు చేశారు. ఇక మరికొన్ని వసతిగృహాల్లో విద్యాసంవత్సరం మొత్తం హాజరు నమోదుకు బయోమెట్రిక్ వాడకుండానే పక్కన పెట్టారన్న విమర్శలున్నాయి. ఈ ఏడాది కూడా అదే పరిస్థితి నెలకొంది.

మిషన్లు వెనక్కు..


బీసీ సంక్షేమ శాఖలో విద్యార్థుల హాజరు నమోదు కోసం రెండేళ్ల క్రితం బయోమెట్రిక్ మిషన్లను వసతి గృహాలకు అందజేశారు. మిషన్లు వచ్చినప్పటి నుంచి కొన్ని వసతిగృహాల్లో హాజరు నమోదు చేస్తుండగా.. మరికొన్ని వసతిగృహాల్లో వీటిని వినియోగించకుండా పక్కన పెట్టారు. విద్యార్థుల హాజరును మాన్యువల్‌గానే వేసుకుని ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుంటున్నారు. మిషన్లు సరఫరా చేసిన ఏజెన్సీ తమకు కాంట్రాక్ట్ గడువు ముగిసిందని బీసీ సంక్షేమ శాఖ వద్ద ఉన్న బయోమెట్రిక్ మిషన్లను వెనక్కు తీసుకుంది. దీంతో ఆ శాఖలో కూడా ఈ ఏడాది బయోమెట్రిక్ లేకుండానే విద్యార్థుల హాజరు నమోదు అవుతోంది.

ప్రభుత్వ ఖజానాకు గండి..

సంక్షేమ వసతిగృహాల్లో విద్యార్థుల హాజరు నమోదు నిర్దిష్టంగా జరగడం లేదు. వసతిగృహంలో ఉన్న విద్యార్థుల సంఖ్య ఒకటైతే.. హాజరు నమోదు చేసుకుంటున్న సంఖ్య మాత్రం మరోలా ఉంటోందని సమాచారం. విద్యార్థులు లేకుండానే ఎక్కువ మంది తమ హాస్టల్‌లో ఉన్నట్లు హాజరు వేసుకుని సంక్షేమాధికారులు తప్పుడు బిల్లులు డ్రా చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న వసతిగృహాల్లో ఈ తంతు ఎక్కువగా ఉందని తెలుస్తోంది. కళాశాల వసతిగృహాల్లో అయితే వందల సంఖ్యలో అదనంగా హాజరు నమోదు చేసుకుంటున్నారనే చర్చ జరుగుతోంది.

ఫేస్ రికగ్నైజ్ యాప్ ఉన్నా..

గిరిజన సంక్షేమ శాఖలో వసతిగృహ విద్యార్థుల హాజరు నమోదు కోసం ఆ శాఖ ఉన్నతాధికారులు బయోమెట్రిక్ విధానాన్ని తొలగించి ఫేస్ రికగ్నైజ్ యాప్‌ను తీసుకొచ్చారు. వసతిగృహ సంక్షేమాధికారి ఫోన్ ద్వారా ఈ యాప్‌లో విద్యార్థుల ఫొటోలు తీసి హాజరు నమోదు చేయాల్సి ఉంది. ఈ విధానాన్ని జిల్లాలోని గిరిజన శాఖకు సంబంధించిన అన్ని వసతిగృహాల్లో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్నారు. అయితే జిల్లా వ్యాప్తంగా ఒక్క కూసుమంచి వసతిగృహంలోనే 80 శాతానికి పైగా యాప్ ద్వారా హాజరు నమోదు అవుతుండగా..మిగిలిన ఏ ఒక్క వసతిగృహంలోనూ పూర్తిస్థాయిలో వినియోగించడం లేదు. దీని ద్వారా హాజరు నమోదు చేస్తే విద్యార్థుల లెక్క పక్కాగా నమోదు అవుతుండటంతో సంక్షేమ అధికారులు దీనిని వినియోగించడం లేదని తెలుస్తోంది.



ఎస్టీ సంక్షేమ శాఖ వసతిగృహాల్లో విద్యార్థుల హాజరుకు రూపొందించిన ఫేస్ రికగ్నైజ్ యాప్

అన్నదాతల్లో ఆందోళన

- పంటలు చేతికందుతున్న దశలో అకాల వర్షం
- వరి, పత్తి పంటలపై తుపాన్ ప్రభావం
- మిర్చికీ తెగుళ్లు ఆశించే ప్రమాదం

ఖమ్మంవ్యవసాయం: అన్నదాతలకు తుపాను దడ పట్టిస్తోంది. పంటలు చేతికందుతున్న తరుణంలో తుపాన్ రావడం పంటలకు ప్రతికూలంగా మారింది. వరి కోతలు ముమ్మరంగా సాగుతుండగా, పత్తి తీత చివరి దశకు చేరింది. మిర్చి పూత, కాత దశల్లో ఉంది. ఈ ఏడాది సమృద్ధిగా కురిసిన వర్షాలతో జిల్లాలో జలాశయాలు నిండడంతో పంటల సాగు విస్తీర్ణం పెరిగింది. వరి 2.82లక్షల ఎకరాల్లో, పత్తి 1.99 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. 57 వేల ఎకరాల్లో మిర్చి వేశారు. ప్రస్తుతం వరి, పత్తి పంటలు చేతికందుతుండగా శనివారం నుంచి జిల్లాలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురుస్తున్నాయి. శనివారం రాత్రి ఖమ్మం పరిసర ప్రాంతాల్లో వర్షం కురవగా, ఆదివారం కూడా పలు చోట్ల వర్షపు జల్లులు కురిశాయి.

ధాన్యం రక్షణకు రైతుల తంటాలు..

కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసి ఉన్న ధాన్యాన్ని వర్షం బారి నుంచి రక్షించుకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలంటే 17 శాతానికి మించి తేమ ఉండకూడదనే నిబంధన ఉంది. దీంతో రైతులు రోడ్లపైన, కల్లాల్లో ఆరబోశారు. తుపాను ప్రభావంతో రెండు రోజులుగా ఎండ లేకపోవడం, వాతావరణంలో మార్పుతో వర్షం కురుస్తుందనే ఆందోళనతో ధాన్యాన్ని కుప్పగా పోసి టార్పాలిన్లు కప్పుతున్నారు. అయితే గాలి, ఉష్ణోగ్రత లేక పంటలో తేమ పెరిగి నాణ్యత దెబ్బతింటుందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.



ధాన్యం రాశులపై కప్పిన టార్పాలిన్లు

పత్తి నాణ్యతకూ ప్రమాదమే..

పత్తి తీతలు దాదాపు చివరి దశకు చేరుకున్నాయి. ప్రస్తుత వాతావరణంతో పత్తి నాణ్యత దెబ్బతినే ప్రమాదం ఉంది. పంట రంగు మారుతుందని, నేల రాలిపోయే ప్రమాదం కూడా ఉందని రైతులు చెబుతున్నారు. తుపాను ప్రభావం పెరిగితే ఉన్న పంట చేతికందకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు మిర్చి తోటలకు సైతం వేరుకుళ్లు, కాండం కుళ్లు వంటి తెగుళ్లు ఆశించే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

వాతావరణాన్ని బట్టి పంటలు కోయాలి

ప్రస్తుతం తపాను ప్రభావం కొనసాగుతోంది. రైతులు అప్రమత్తంగా ఉండాలి. జిల్లాలో ప్రధానంగా వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. వాతావరణాన్ని పరిశీలిస్తూ పంటలు కోయాలి. కల్లాల్లో, కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని రాశులుగా పోసి టార్పాలిన్లు కప్పాలి. మిర్చి తెగుళ్లకు రక్షణ చర్యలు పాటించాలి.

– రవికుమార్, కేవీకే శాస్త్రవేత్త

ప్రజా ప్రభుత్వ విజయాలపై కళా ప్రదర్శనలు



నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

ఖమ్మంరూరల్: ప్రజా ప్రభుత్వం ఏర్పడిన సంవత్సర కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై నాయుడుపేటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నాటక, నృత్య కళా ప్రదర్శనలు ధూంధాంగా కొనసాగాయి. ఆరు గ్యారంటీలతో అభివృద్ధికి బాటలు, ఇందిరమ్మ రాజ్యంలో ప్రజల వద్దకే ప్రజా పాలన వచ్చిందని, ఈ ప్రభుత్వం వచ్చిన వెంటనే కొలువుల జాతర వచ్చిందని, రాజీవ్ ఆగరోగ్యశ్రీ వైద్య ఖర్చులను రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంపు తదితర సంక్షేమ కార్యక్రమాలపై అంతడుపుల నాగరాజు ఆధ్వర్యంలో నాటక, గేయ రూపంలో ప్రదర్శించిన కళారూపాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి కె. సత్యనారాయణ, యువజన, క్రీడల సంక్షేమాధికారి సునీల్‌రెడ్డి, తహసీల్దార్ పి.రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మధిరలో ప్రజా విజయోత్సవం

ఖమ్మం సహకారనగర్ : ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా మధిర రెడ్డి గార్డెన్స్‌లో సోమవారం సాయంత్రం 6 గంటలకు అంతడుపుల నాగరాజు బృందంచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

హెచ్‌ఐవీ రహిత జిల్లాగా మార్చాలి

డీఎంహెచ్‌ఓ కళావతిబాయి

ఖమ్మంవైద్యవిభాగం : ఖమ్మాన్ని హెచ్‌ఐవీ రహిత జిల్లాగా మార్చాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి. కళావతిబాయి పిలుపునిచ్చారు. ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా ఆదివారం నగరంలో నిర్వహించిన ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా మందులు వాడాలని, పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఆత్మస్థైర్యంతో అన్ని రంగాల్లో రాణించాలన్నారు. అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ డి. రామారావు మాట్లాడుతూ యువత హెచ్‌ఐవీ గురించి తెలుసుకోవాలని, ఆ వ్యాధి బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇది ఏ ఒక్కరి సమస్యో కాదని, సామాజిక అంశమని, ప్రజలంతా భాగస్వాములై అవగాహన కల్పించాలని కోరారు. ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్, ఏఆర్‌టీ వైద్యాధికారి జయకుమార్ మాట్లాడారు. అనంతరం జిల్లాలో ఉత్తమ సేవలందించిన పలు సంస్థల వారికి అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ లీగల్ సెల్ అథారిటీ సిబ్బంది ఎ.శంకర్, ఆశ పాజిటివ్ పీపుల్ అసోసియేషన్ సిబ్బంది సునంద, శ్రీనివాసరావు, జాగీరుల్లా, జార్జ్, మమత, చెంచు రత్నయ్య, లక్ష్మణ్, ఖతిజ, డెమో సాంబశివారెడ్డి, సత్యకుమార్, మహమూద్ అలీ పాల్గొన్నారు.



ఉత్తమ సేవలందించిన వారికి అవార్డులు ప్రదానం చేస్తున్న డీఎంహెచ్‌ఓ

ఉత్సాహంగా 2కే రన్

ఖమ్మం స్పోర్ట్స్ : ప్రజాపాలన విజయోత్సవ 2కే రన్‌ను నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియం నుంచి జెడ్పీ సెంటర్ వరకు ఆదివారం నిర్వహించగా డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత, ప్రజలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించేలా అవగాహన కల్పిస్తూ రన్ నిర్వహించినట్లు తెలిపారు. నిత్యం దైనందిన జీవితంలో ఎన్నో ఒత్తిడులకు గురవుతూ ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయడంతో అనేక సమస్యలు ఎదురవుతున్నాయని, ప్రతీ ఒక్కరూ ఆరోగ్యంగా ఉండేలా వ్యాయామాలు, ఆహార నియమాలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో అథ్లెటిక్స్ కోచ్ ఎండీ. గౌస్, వాలీబాల్ కోచ్ ఎండీ.అక్బర్ అలీ, క్రీడా సంఘాల ప్రతినిధులు కె.కృష్ణహర్ బాబు, వి.వి.సాంబమూర్తి, ఎండీ.మతిన్, కరాటే రాము తదితరులు పాల్గొన్నారు.



రన్‌ను ప్రారంభిస్తున్న సునీల్‌కుమార్ రెడ్డి

'బుగ్గపాడు'కు కదలిక

బుగ్గపాడు మెగా ఫుడ్‌పార్క్‌కు ఎట్టకేలకు కదలిక వస్తోంది. పారిశ్రామిక వేత్తలకు ఆహ్వానం పలికేందుకు ఈనెల 5న రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి రానున్నారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేస్తే ప్రత్యక్షంగా 6వేల మందికి, పరోక్షంగా 10 వేల మందికి ఉపాధి లభిస్తుందని అధికారుల అంచనా. మంత్రుల రాకకోసం జనసమీకరణ, రైతులతో స్టాళ్ల ఏర్పాట్లకు టీఎస్‌ఐఐసీ సమాయత్తమవుతోంది. – సత్తుపల్లి

- మెగా ఫుడ్‌పార్క్ ఏర్పాటుతో వేలాది మందికి ఉపాధి
- పారిశ్రామికవేత్తలకు ఆహ్వానం పలికేందుకు ఈనెల 5న నలుగురు మంత్రుల రాక
- రైతులతో సమావేశం.. స్టాళ్ల ఏర్పాటుకు సమాయత్తం
- ఇప్పటికే రెండు పరిశ్రమలకు పచ్చజెండా



బుగ్గపాడు మెగా ఫుడ్‌పార్క్ ఇదే..

వైఎస్సార్‌తో తొలి అడుగు..

సత్తుపల్లి ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందేందుకు 2008 జనవరి 27న నాటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి బుగ్గపాడులో ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రియల్ పార్క్‌కు శంకుస్థాపన చేశారు. అప్పటి ఎమ్మెల్యే జలగం వెంకటరావు చొరవతో 203 ఎకరాల భూమి సేకరించారు. అయితే వైఎస్సార్ మరణానంతరం ఈ ఫుడ్‌పార్క్‌కు గ్రహణం పట్టింది. తెలంగాణ ఆవిర్భావం తర్వాత 2017లో కదలిక రాగా, నాటి మంత్రులు కేటీఆర్, తుమ్మల నాగేశ్వరరావు ఫుడ్‌పార్క్ అభివృద్ధిపై దృష్టి సారించినా కార్యరూపం దాల్చలేదు. ఇక ఈ ఏడాది జనవరి 29న సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయితో కలిసి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుగ్గపాడు ఫుడ్‌పార్క్‌ను సందర్శించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. వ్యవసాయాధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా.. పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పర్యటన ఖరారైందని తెలుస్తోంది.

రూ.119 కోట్ల కేటాయింపు..

ఫుడ్‌పార్క్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.119 కోట్లు కేటాయించారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం రూ.50 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం(టీఎస్‌ఐఐసీ) రూ.30 కోట్లు, నాబార్డ్ నిధులు రూ.39 కోట్లుగా నిర్ణయించారు. ఈ మొత్తంలో రూ.60 కోట్లతో పరిపాలనా భవనం, వేర్‌హౌస్, ప్యాకింగ్ హౌస్, కోల్డ్ స్టోరేజీ, లేబర్ కోర్టు, స్టాండర్డ్ డిజైన్ ఫ్యాక్టరీ షెడ్, 11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్, సెంటర్ డివైడర్ లైటింగ్ సిస్టమ్, డ్రైనేజీ, ప్రహరీ, రోడ్ల నిర్మాణం, లోతట్టు ప్రాంతాల్లో మట్టి నింపడం, వాటర్ ట్యాంక్ తదితర పనులు చేపట్టారు. అయితే ఫుడ్‌పార్క్ 2018 నుంచి నిరుపయోగంగా ఉండడంతో కొన్ని చోట్ల టైల్స్ ఊడిపోయి, రోడ్లు, ఖాళీస్థలాల్లో పిచ్చిమొక్కలు మొలిచి అధ్వానంగా మారింది. వీటిని మరమ్మతు చేయాల్సి ఉంది. ఇక రూ.15 కోట్లతో మరో 60 ఎకరాల్లో బీటీ రోడ్లు, పరిపాలన భవనం నిర్మించారు. వీటిలో చిన్న పరిశ్రమలకు భూములను లీజుకు ఇవ్వాలని నిర్ణయించారు.

యాంకరింగ్ ప్రాజెక్టులు వెనక్కు..

2016లో యాంకరింగ్ ప్రాజెక్టు కింద ఫ్రూషన్ ఇండియా ఆరెకరాల్లో మామిడి, జామ పల్ప్ ఫ్యాక్టరీ పెట్టేందుకు ముందుకొచ్చింది. కానీ ఆ తర్వాత ఆ ఫ్యాక్టరీ కాస్తా వెనక్కి వెళ్లిపోయింది. అలాగే హైదరాబాద్‌కు చెందిన ఎలైట్ కంపెనీ పది ఎకరాలు, వర్ధినేని గ్రూప్ పామాయిల్ రిఫైనరీ కోసం నాలుగు ఎకరాలు, బయోజన్ గ్రేడియా మిర్చి పరిశ్రమకు ఒక ఎకరం భూమి కోసం దరఖాస్తు చేసుకుని ఏళ్లు గడుస్తున్నా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు.

రూ.లక్షల్లో ధరే శాపమా..

బుగ్గపాడులో పరిశ్రమల స్థాపనకు ఇచ్చే భూమి ధర అందుబాటులో లేకపోవడంతో పారిశ్రామిక వేత్తలు ముందుకు రావడం లేదని సమాచారం. ఎకరం భూమి 33 సంవత్సరాల లీజుకు రూ.35 లక్షల నుంచి రూ.40 లక్షలు, భూమి పూర్తిగా విక్రయిస్తే రూ.80 లక్షలు ధర పలకడమే పరిశ్రమల స్థాపనకు అవరోధంగా మారిందనే విమర్శలు వస్తున్నాయి. ఈ ప్రాంతంలో రూ.25 లక్షలకే ఎకరం భూమి వచ్చే అవకాశం ఉండగా అంత ధర పెట్టి.. అదీ మారుమూల ప్రాంతంలో పరిశ్రమల స్థాపనకు ఎలా వస్తామనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. నాలుగేళ్ల క్రితం ఫుడ్‌పార్క్‌లో ఓ పరిశ్రమ ఏర్పాటుకు వచ్చిన వ్యక్తి భూమి ధరను పరిశీలించి.. ఫుడ్‌పార్క్‌కు కిలోమీటర్ దూరంలోనే ఎకరం భూమి రూ.20 లక్షలకు కొనుగోలు చేసి మొక్కజొన్న ఫ్యాక్టరీ పెట్టారు. ఫుడ్‌పార్క్‌లో మౌలిక సదుపాయాలకు అయిన ఖర్చులతో కలిపి భూమి విలువను లెక్కించడం వల్లే సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని సమాచారం. గతేడాది ఖమ్మంలో టీఎస్‌ఐఐసీ ఆధ్వర్యంలో పెట్టుబడిదారులు, పారిశ్రామిక వేత్తల సమావేశం ఏర్పాటు చేసినా ఫలితం కనిపించలేదు.

రెండు పరిశ్రమలకు..

బుగ్గపాడు ఫుడ్‌పార్క్‌లో రెండు పరిశ్రమలకు కేటాయింపులు జరిగాయి. వైఅండ్‌జీ కంపెనీ మామిడి, జామ ఫ్రూట్‌ను కట్‌చేసి కోల్డ్ స్టోరేజీలో గడ్డకట్టించి ఇతర దేశాలకు ఎగుమతి చేసేందుకు ముందుకొచ్చింది. ఇప్పటికే ఈ ఫ్యాక్టరీ ట్రయల్ రన్ పనులు పూర్తిచేసింది. ట్రాన్స్‌జెండ్ కంపెనీ కాజు ప్రాసెసింగ్‌కు ముందుకొచ్చింది. ఫుడ్‌పార్క్‌లోని కోల్డ్‌స్టోరేజీ, స్టాండర్డ్ డిజైన్ ప్యాక్‌లను ఈ రెండు కంపనీలకు కేటాయించారు. వీటిని మంత్రులు లాంఛనంగా ప్రారంభించేందుకు కసరత్తు జరుగుతోంది.

క్లుప్తంగా

నవోదయలో అ'పూర్వ' సమ్మేళనం



గురువులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

కూసుమంచి: పాలేరులోని జవహర్ నవోదయ విద్యాలయలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం (మిలాన్ – 2024)ను ఘనంగా నిర్వహించారు. విద్యాలయ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు జ్యోతి ప్రజల్వన చేసి ప్రారంభించగా.. 1994 నుంచి గత సంవత్సరం వరకు చదువుకున్న విద్యార్థులు హాజరయ్యారు. పూర్వ విద్యార్థులు వారి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పూర్వ, ప్రస్తుత గురువులను సన్మానించారు. అనంతరం రక్తదానం నిర్వహించారు.

వాసవీక్లబ్ గవర్నర్‌గా ప్రమాణస్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న వెంకటేశ్వరరావు

ఖమ్మంగాంధీచౌక్: వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ వీ106ఏ ఉమ్మడి ఖమ్మం జిల్లా గవర్నర్‌గా ఎన్నికైన కొత్త వెంకటేశ్వరరావు ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. నగరంలోని వాసవీ గార్డెన్స్‌లో ఈ కార్యక్రమం జరిగింది. క్లబ్ మాజీ అధ్యక్షులు గంపా నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొనగా.. ప్రస్తుత గవర్నర్ గుమ్మడివెల్లి శ్రీనివాసరావు నూతన గవర్నర్‌చే ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో కడవెండి శ్రీనివాసరావు, నాలా సతీశ్, దోసపాటి వెంకటేశ్వరరావు, పసుమర్తి రామచంద్రరావు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు చిన్ని కృష్ణారావు, కార్పొరేటర్ పసుమర్తి రామ్మోహన్‌రావు, మేళ్లచెరువు వెంకటేశ్వరరావు, పులిపాటి ప్రసాద్, గోళ్ల రాధాకృష్ణమూర్తి, గెల్లా కృష్ణవేణి, వరప్రసాద్, దివాకర్ గుప్తా, సాంబశివరావు, జగన్నాథం, న్యాయవాదులు యాచవరపు గోవర్దన్‌రెడ్డి, తాళ్లూరి దిలీప్‌చౌదరి, దిరిశాల కృష్ణారావు, ఆళ్ల నిరోష, చంద్ర లీలామోహన్ తదితరులు పాల్గొన్నారు.

కత్తితో బెదిరించి రూ.45 వేలు చోరీ

తల్లాడ: మండలంలోని పాత మిట్టపల్లి గ్రామంలో ఆదివారం తెల్లవారు జామున ముగ్గురు వ్యక్తులు కత్తితో బెదిరించి రూ.45 వేలు ఎత్తుకెళ్లారు. పోలీసుల కథనం ప్రకారం.. మువ్వా సూర్యనారాయణ ఆయన కుమార్తె విజయకుమారి ఇంట్లో నిద్రిస్తుండగా గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు మాస్కులు ధరించి కత్తితో బెదిరించి ఇంట్లో దాచి ఉంచిన రూ.45 వేల నగదును దోచుకెళ్లారు. ఎస్ఐ కొండల్‌రావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ డీలర్ మృతికి సంతాపం



హనుమంతు (ఫైల్)

తిరుమలాయపాలెం: మండలంలోని జూపెడ రేషన్ డీలర్ బొల్లికొండ హనుమంతు (85) ఆది వారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న డిప్యూటీ తహసీల్దార్ నర్సింహారావు, మండల రేషన్ డీలర్లు హనుమంతు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీలర్లు ఎడ్ల ముత్తయ్య, మదార్, దంతాల బాలరాజు, రాయల ప్రసాద్, పసలాది దర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

లారీలో డీజిల్, ఈసీఎం మిషన్ చోరీ

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని పాతబస్టాండ్ సమీపంలోని సీఎస్ఐ చర్చి వద్ద పార్క్ చేసి ఉంచిన లారీలో నుంచి 200 లీటర్ల డీజిల్, ఈసీఎం మిషన్లను చోరీ చేశారని లారీ యజమాని దేవిశెట్టి సైదులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. లారీకి కిరాయి లేనందున చర్చి వద్ద పార్కింగ్ చేసినట్లు తెలిపారు. ఆదివారం లారీని కిరాయికి పంపేందుకు వెళ్లి పరిశీలించగా లారీ ట్యాంకులో నిల్వ ఉంచిన సుమారు రూ.20 వేల విలువ చేసే డీజిల్, రూ.80 వేల విలువ చేసే ఈసీఎం మిషన్ అపహరణకు గురైనట్లు ఫిర్యాదులో వివరించారు.

వ్యక్తి ఆత్మహత్య

సత్తుపల్లిటౌన్: పురుగుమందు సేవించి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని రుద్రాక్షపల్లిలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ యాదాల సత్యనారాయణ (40) ఆదివారం పురుగుమందు సేవించి అపస్మారక స్థితికి చేరాడు. గమనించిన కుటుంబ సభ్యులు సత్తుపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య ఇందిర, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు.



పామాయిల్ గెలలు
టన్ను ధర రూ.19,144

రుణమాఫీ.. అసంపూర్ణం



- జిల్లాలో ఇప్పటివరకు 1.33 లక్షల మందికి మాఫీ
- వీరికి రూ.926.60 కోట్ల మేర లబ్ధి
- నాలుగో విడతలో అంతంత మాత్రంగానే..
- ఇంకా 1.50 లక్షల మందికి పైగా రైతులకు నిరాశే

ఖమ్మంవ్యవసాయం: రైతు పండుగలో భాగంగా శనివారం రాష్ట్ర ప్రభుత్వం నాలుగో విడత రుణమాఫీ నిధులు విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా ప్రజా పాలన విజయోత్సవ కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన రైతు పండుగలో శనివారం నాలుగో విడత రుణమాఫీ నిధులు విడుదల చేశారు. ఈ విడతలో జిల్లాలోని 17,852 మంది రైతులకు రూ.154.03 కోట్లు విడుదలయ్యాయి. దీంతో మొత్తంగా ఇప్పటివరకు 1,33,197 మంది రైతులకు రూ.926.60 కోట్ల మేర రుణాలు మాఫీ అయ్యాయి. కానీ, అర్హులైన రైతులు ఇంకా పెద్దసంఖ్యలో ఉండగా వారంతా ప్రస్తుత జాబితా చూసి నిరాశకు లోనయ్యారు.

రూ.లక్ష లోపు నుంచి మొదలు

జిల్లాలో 14 బ్యాంకుల పరిధిలో తీసుకున్న పంట రుణాలను ప్రభుత్వం విడతల వారీగా మాఫీ చేస్తోంది. తొలుత రూ.లక్ష లోపు రుణాలు ఉన్న వారికి, ఆ తర్వాత రూ.లక్ష నుంచి 1.50 లక్షల వరకు, మూడో విడతలో రూ.1.50 నుంచి రూ.2 లక్షల వరకు రుణాలను మాఫీ చేసింది. ఈ విడతల్లో మిగిలిన వారికి నాలుగో విడతగా శనివారం నిధులు విడుదల చేసింది.

రూ.4,307 కోట్లలో రూ.926.60 కోట్లు

జిల్లాలో 2023 డిసెంబర్ నాటికి 3,73,157 మంది రైతులు రూ.4,307.58 కోట్ల పంట రుణాలు బకాయి ఉన్నారు. వీటిలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) నుంచే 1,69,864 మంది రైతులు రూ.908.27 కోట్ల రుణాలు తీసుకున్నారు. డీసీసీబీ ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో కూడా ఈ వివరాలను పొందుపర్చింది. ఈ బ్యాంకు పరిధిలో ప్రస్తుత ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలతో పాటు మహబూబాబాద్ జిల్లాలోని బయ్యారం, గార్ల, ములుగు జిల్లాలోని వాజేడు, వెంకటాపురం మండలాల పీఏసీఎస్‌ల నుంచి ఇచ్చిన రుణాలు ఉన్నాయి. అయితే, 1.69 లక్షల మంది రైతులకు గాను నాలుగు విడతల్లో 67 వేల మంది రైతుల రుణాలేమాఫీ అయ్యాయి. ఈ ఒక్క బ్యాంకులోనే పెద్ద సంఖ్యలో రైతులు రుణమాఫీకి నోచుకోకపోగా.. ఏపీజీవీబీ, ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకుల పరిధిలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. కాగా, ప్రభుత్వం నాలుగు విడతల్లో రుణమాఫీ చేసినా జిల్లాలో మూడో వంతు రైతులకు నాలుగో వంతు రుణాలు మాత్రమే మాఫీ అయ్యాయని గణాంకాలు చెబుతున్నాయి.

1.70 లక్షల మందిలో 17 వేల మందికే..

రైతులు నాలుగో విడత రుణమాఫీ కోసం ఎదురుచూశారు. కానీ, ప్రభుత్వం ప్రకటించిన జాబితాను చూసి నిరాశకు గురయ్యారు. జిల్లాలో 1.70 లక్షల మంది వరకు రైతులు తమకు రుణమాఫీ వర్తిస్తుందని ఆశించారు. అయితే, కేవలం 17,852 మంది రైతులకు మాత్రమే ప్రభుత్వం నాలుగో విడతలో మాఫీ చేసింది. అంటే కేవలం 10 శాతం రైతులకే రుణమాఫీ వర్తించినట్లయింది. అయితే వ్యవసాయ శాఖ అధికారులు మాత్రం మరో విడతగా రుణమాఫీ ఉంటుందని, అప్పుడు అర్హులందరికీ మాఫీ అవుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

నాలుగు విడతల్లో జిల్లాలోని రైతుల రుణమాఫీ వివరాలు

విడత	రైతుల సంఖ్య	నగదు (రూ.కోట్లలో)
మొదటి	57,857	264.22
రెండు	33,942	262.50
మూడు	23,546	245.85
నాలుగు	17,852	154.03
మొత్తం	1,33,197	926.60

నాలుగో విడతలో బ్యాంకుల వారీగా రుణమాఫీ

బ్యాంకు	రైతుల సంఖ్య	నగదు (రూ.ల్లో)
ఏపీజీవీబీ	5,348	54,32,01,878
డీసీసీబీ	6,820	41,30,57,669
యూబీఐ	2,497	25,32,78,692
ఎస్‌బీఐ	2,150	22,61,48,381
కెనరా బ్యాంక్	515	5,21,34,655
బ్యాంక్ ఆఫ్ బరోడా	189	2,08,47,230
ఐఓబీ	137	1,12,32,882
సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	87	96,74,085
ఇండియన్ బ్యాంక్	57	58,71,005
యాక్సిస్	18	10,97,908
పంజాబ్ నేషనల్ బ్యాంక్	14	17,60,175
బ్యాంక్ ఆఫ్ ఇండియా	10	11,16,747
ఐడీబీఐ	8	7,11,862
హెచ్‌డీఎఫ్‌సీ	2	1,87,073
మొత్తం	17,852	154,03,20,242

ఉత్సాహంగా ఉర్సు ఉత్సవాలు!

- కొనసాగుతున్న నాగుల్ మీరా జులూస్
- ఆకట్టుకున్న సింగిరి, తంబోలా వాయిద్యకారులు
- ప్రత్యేక ఆకర్షణగా కవ్వాలి కళాకారులు
- కులమతాలకు అతీతంగా పాల్గొన్న భక్తులు
- అడుగడుగునా అశేష భక్తజన నీరాజనం



అశ్వరథంపై నాగుల్‌మీరా నిషానీలు, అశ్వాలపై నవ జవాన్లు

ఇల్లెందురూరల్/ఇల్లెందు: సర్వమత సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలుస్తున్న హజరత్ నాగుల్‌మీరా దర్గాహ్ ఉర్సు ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల రెండో రోజైన ఆదివారం భక్తుల కోలాహలం నడుమ పట్టణంలోని హజరత్ ఖాసీం దుల్హాహ్ దర్గా షరీఫ్ నుంచి సుమారు ఏడు గంటల పాటు సత్యనారాయణపురం గ్రామ శివారు అటవీ ప్రాంతంలోని హజరత్ నాగుల్‌మీరా మౌలాచాన్ చిల్లా వరకు జులూస్ కొనసాగింది.

నవ జవాన్ల మార్గనిర్దేశంలో..

ఎంతో ఆకర్షణీయంగా అలంకరించిన కన్నీల్ ముందు నడుస్తుండగా వెనుక ముగ్గురు నవ జవాన్లు కత్తులు పట్టుకుని గుర్రాలపై, మరో ఇద్దరు నవ జవాన్లు నెమలి పింఛం చేతపట్టుకొని దారిచూపుతున్నట్లుగా ఒంటెలపై ముందుకు సాగగా.. నవ జవాన్ల మార్గనిర్దేశంలో నాగుల్ మీరా నిషానీలు, భక్తులు ముందుకు కదిలారు. ఈ జులూస్‌లో ముందు నాగుల్ మీరా, ఆ తర్వాత నీల్ హైదర్ బగ్గీలు వెళ్తుండగా.. బంగారు వర్ణంలో అలకరించిన పెద్ద బగ్గీలో మౌలాలీ చాంద్ నిషానీ రూపంలో భక్తులకు దర్శనమిస్తూ నాగుల్‌మీరా దర్గా వరకు ప్రయాణం సాగింది.

అడుగడుగునా నీరాజనం

పట్టణంలోని హజరత్ ఖాసీందుల్హా దర్గాహ్ షరీఫ్ నుంచి ఉదయం 11 గంటలకు జులూస్ ప్రారంభమైంది. తొలుత ఖాసీం దుల్హా దర్గాహ్, పీరీల కొట్టంలో పూజలు చేసిన అనంతరం నంబర్ టూ బస్తీ, పాత బస్టాండ్, జగదాంబసెంటర్, ఆంబజార్, బుగ్గవాగు, కొత్త బస్టాండ్, గోవింద్ సెంటర్, సత్యనారాయణపురం మీదుగా అటవీ ప్రాంతంలో కొలువుదీరిన హజరత్ నాగుల్‌మీరా మౌలాచాన్ చిల్లా వరకు జులూస్ సాగింది. నాగుల్ మీరా నిషానీలతో పాటు గంధంతో ప్రత్యేక రథం వెంటరాగా తెల్లటి దుస్తులు ధరించిన భక్తులు పాదయాత్ర ద్వారా ముందుకు సాగారు. భక్తులు అడుగడుగునా బగ్గీల ముందు నీళ్లారబోసి, కొబ్బరికాయలు కొట్టి నాగుల్ మీరా ఆశీర్వాదం పొందారు. ఈక్రమంలోనే తెల్లటి దుస్తులు ధరించిన భక్తులు ప్రజలకు ఊదుపొగ పెడుతూ చందనం రాస్తూ నాగుల్ మీరా ఆశీర్వాదం అందించారు.

ఆకట్టుకున్న సంగీత వాయిద్యాలు

ఏటా నాగుల్ మీరా జులూస్‌లో కళాకారులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తారు. జులూస్‌కు ముందు భాగంలో నాగ్‌పూర్ నుంచి వచ్చిన ఖవ్వాలి కళాకారులు మధురమైన భక్తి గీతాలు ఆలపిస్తుండగా.. వారికి అనుగుణంగా ప్రత్యేక వాహనంలో కళాకారుల సంగీత వాయిద్యం ఆకట్టుకుంది. ఆ వెనుకాల గోదావరి జిల్లాల నుంచి వచ్చిన సింగిరి మేళం డప్పు వాయిద్యాలు, ఆ వెనుకాల తంబోలా కళాకారులు డ్రమ్ వాయిస్తుండగా, ఆ వెంటనే హైదరాబాద్ మర్ఫీలు ప్రత్యేక వాయిద్యాలతో జులూస్‌లో సందడి చేశారు. చివరలో నాగుల్‌మీరా భక్తులుగా ఆయన సేవలో తరిస్తున్న సత్యనారాయణపురం గ్రామ బ్యాండ్ మేళం ట్రూప్ సంప్రదాయ డప్పు చప్పుళ్లతో జులూస్‌లో జోష్ పుట్టించారు. శబ్దరీతులకు తగ్గట్టుగా యువత నృత్యాలు చేయగా, అయ్యప్ప మాలధారులు నాగుల్‌మీరాకు సమర్పించేందుకు కావడిలో నైవేద్యం సిద్ధం చేసుకొని భుజంపై మోస్తూ జులూస్‌లో పాల్గొన్నారు. హైదరాబాద్ నుంచి వచ్చిన అశ్వాలు సైతం జులూస్‌లో ఆకట్టుకునే రీతిలో ప్రదర్శనలు చేస్తూ సందడి చేశాయి.

ఏడు గంటల పాటు ఊరేగింపు

పట్టణంలోని ఖాసీం దుల్హా దర్గా నుంచి నాగుల్ మీరా దర్గా వరకు ప్రతీ కూడలిలో అరగంట పాటు భాజాలతో హోరెత్తిపోయింది. భారీ సంఖ్యలో పాల్గొనడంతో పాటు రహదారికి ఇరువైపులా జనం బారులు తీరి నాగుల్‌మీరాకు ఎదురేగి ఆశీర్వాదం తీసుకోవడంతో జులూస్ ఆలస్యంగా ముందుకు సాగింది. సుమారు ఏడు గంటలకుపైగా కొనసాగిన జులూస్‌కు హజరత్ నాగుల్‌మీరా దర్గాహ్‌లో మాలిక్ లక్ష్మీనారాయణ ఎదురెళ్లి భక్తుల కోలాహలం నడుమ ఘనంగా ఆహ్వానించారు.

తప్పిపోయిన వ్యక్తి కుటుంబం చెంతకు..

ఖమ్మంఅర్బన్: తిరుపతి వెంకన్న దర్శనానికి వెళ్తూ.. విజయవాడలో మతిస్థిమితం కోల్పోయి తప్పిపోయిన ఓ వ్యక్తిని అన్నం ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులకు ఆది వారం అప్పగించారు. ములుగు జిల్లా వెంకటాపురం మండలం రామ చంద్రాపురానికి చెందిన మిచ్చా నరసింహారావు (48) కుటుంబ సభ్యులతో ఇటీవల తిరుపతి వెళ్లి విజయవాడ వరకు వచ్చి మతిస్థిమితం కోల్పోయి తప్పిపోయాడు. ఖమ్మం జిల్లా కల్లూరులో మతిస్థిమితం లేని ఓ వ్యక్తి ప్రజలను ఇబ్బంది పెడుతుండగా పోలీసులు అన్నం ఫౌండేషన్‌కు అప్పగించారు. అక్కడ కోలుకున్న నర్సింహారావు తన వివరాలు చెప్పగా.. ఆరా తీసిన ఫౌండేషన్ నిర్వాహకుడు శ్రీనివాసరావు అతడిని కటుంబ సభ్యులకు అప్పగించారు. నర్సింహారావు భార్య సరోజిని, కుమారుడు ఉదయ్‌కిరణ్, పుంజా ముత్యాలు, రమేశ్, వరప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.

జడ్జి కారును ఢీకొట్టిన గుర్తుతెలియని వాహనం

చౌటుప్పల్ రూరల్: జిల్లా జడ్జి ఆదివారం కారులో ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు వెళ్తుండగా.. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా సమీపంలోకి రాగానే గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. కారు కుడి భాగం దెబ్బతింది. కారు డ్రైవర్ వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చౌటుప్పల్ సీఐ మన్మథకుమార్ తెలిపారు.

కుల, మతాల పేరుతో విభజన

సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జనభోజనాల్లో వక్తలు



అభివాదం చేస్తున్న ప్రముఖులు, వక్తలు

ఖమ్మంమయూరిసెంటర్: రాజకీయ అవసరాల కోసం కుల, మతాల పేరుతో ప్రజలను విభజిస్తున్నారని, మనుషుల మధ్య గోడలు కడుతున్నారని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం ఖమ్మంలోని మలీదు జగన్ మామిడి తోటలో ప్రత్యామ్నాయ సంస్కృతి పెంపొందించేందుకు సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో జనభోజనాలను నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, విద్యావంతుల వేదిక నాయకులు అంబటి నాగయ్య, మాజీ మావోయిస్టు జంపన్న, స్పర్శ అధ్యయన వేదిక బాధ్యులు స్పర్శ భాస్కర్ మాట్లాడుతూ.. ఐక్యంగా ఉన్న ప్రజల మధ్య కుల, మతాలు వైరుధ్యాలను పెంచుతున్నాయని, రాజకీయ పబ్బం పొందేందుకు కుల, మతాలను నిలబెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీనికి వ్యతిరేకంగా అశేష ప్రజానీకం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ప్రజలు చైతన్యవంతులైతే పాలకుల ఆటలు సాగవని, అందుకే ప్రజల మధ్య తప్పుడు చరిత్రను, సంస్కృతిని పెంపొందిస్తున్నారని ఆరోపించారు. సమాజం ఆమోదించని సనాతన ధర్మాలను ప్రోత్సహిస్తున్నారని, అన్నం మెతుకులపై కులాన్ని అంటించి రాజకీయ లబ్ధి పొందేందుకు కుల భోజనాలను పెంపొందిస్తున్నారని దుయ్యబట్టారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసిన ప్రజాప్రతినిధులు కుల, మతాల కార్యక్రమాల్లో ఎలా పాల్గొంటారని ప్రశ్నించారు. కాగా, జన భోజనాల్లో క్రీడా పోటీలు నిర్వహించారు. మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా కళాకారులు ఆటపాట నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి గోకినపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు ఆవుల వెంకటేశ్వర్లు, సీవై పుల్లయ్య, ఆవుల అశోక్, సీహెచ్.శిరోమణి, ఝాన్సీ, కొల్లేటి నాగేశ్వరరావు, శోభ, కె.శ్రీనివాస్, తేజ, రాకేశ్, మంగతాయి, లక్ష్మణ్, హనుమంతరావు, ఆజాద్, వెంకటేశ్, బల్లేపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లాస్థాయి టీటీ టోర్నీ

ఖమ్మంస్పోర్ట్స్: ఉమ్మడి జిల్లాస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. అనంతరం జిల్లా టేబుల్ టెన్నిస్ జట్టుకు ఎంపికైన వారి వివరాలను ప్రకటించారు. అండర్–11 బాలుర జట్టులో కె.హితేశ్ (తల్లాడ), యశ్వంత్ (ఖమ్మం), జి.గౌరవ (ఖమ్మం), దుర్గా మణికంఠ, నిఖిల్ (పాల్వంచ) ఎంపికయ్యారు. అండర్–11 బాలికల జట్టులో బాలసాని హారిక, బాలసాని తన్మయిశ్రీ (ఖమ్మం), రోజన, షైనీ (పాల్వంచ), నేహశ్రీ (ఖమ్మం), అండర్–15 బాలురలో ఎస్‌కె ఫజల్ (ఖమ్మం), హరి, ఈ.తరుణ్ తల్లాడ, ఎ.ఉజ్వల్ (ఖమ్మం), సోమశేఖర్ (అశ్వాపురం), పరిటాల జ్వలిత్ (ఖమ్మం), కేతన్, తేజ (అశ్వాపురం), రామ సాకేత్ (పాల్వంచ), అభినవ కృష్ణ(తల్లాడ), అండర్–15 బాలికల జట్టులో కె.స్పందన చంద్ర (ఖమ్మం), పి.లతిక (పాల్వంచ), పి.హర్షిత (నేలకొండపల్లి), డి.ఉజ్వల, తేజస్వి, అక్షయ, జెవేరియా (తల్లాడ), గాయత్రి (కూసుమంచి) ఎంపికయ్యారు. అండర్–17 బాలురలో పి.మోహిత్‌కృష్ణ, తమస్ తేజ (ఖమ్మం), స్థితప్రజ్ఞ, అఖిలేశ్ (ఖమ్మం), అండర్–17 బాలికల జట్టులో జి.సిరి (ఖమ్మం), వి.సుప్రియ (నేలకొండపల్లి), జి.చంద్రిక రాణి, షర్మిలారాణి (టేకులపల్లి), పి.సౌమ్యశ్రీ (దానవాయిగూడెం), నవ్య, ఎస్.విద్యశ్రీ (నేలకొండపల్లి), కల్పకబిందు, శ్రావణి (ఖమ్మం) ఎంపికయ్యారు. అండర్–19 బాలికల జట్టుకు నిషు (టేకులపల్లి), స్నేహిత, కె.ప్రియా (టేకులపల్లి), డి.సంగీత (దానవాయిగూడెం), ఇందు (నేలకొండపల్లి), బాణోత్ అఖిల (ఖమ్మం) జిల్లా జట్టుకు ఎంపిక కావడమే కాకుండా ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాల్లో నిలిచారు. విజేతలకు డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు బాలసాని విజయ్‌కుమార్, కార్యదర్శి వీవీ సాంబమూర్తి బహుమతులు అందించారు.

బైక్‌ను ఢీకొట్టిన లారీ..

- ఒకరు మృతి.. ముగ్గురికి గాయాలు
- దైవదర్శనానికి వెళ్తుండగా ఘటన



యశ్విత్ (ఫైల్)



చికిత్స పొందుతున్న ఊకె రాజు

సత్తుపల్లిటౌన్: రెండు కుటుంబాలు ఆనందంగా దైవదర్శనానికి బయల్దేరాయి. బస్టాండ్‌కు చేరుకునే లోపే ద్విచక్రవాహనాలను గుర్తుతెలియని లారీ ఢీకొనడంతో ఓ బాలుడు మృతి చెందగా బాలిక, తల్లిదండ్రులకు తీవ్రగాయాలైన ఘటన సత్తుపల్లిలో ఆదివారం చోటుచేసుకుంది. మండలంలోని జగన్నాథపురానికి చెందిన ఊకే రాజు, అనకాపల్లి జిల్లా రోళ్లకుంట గ్రామానికి చెందిన జి.సత్యభువనప్రసాద్ సింగరేణి మహాలక్ష్మీ క్యాంప్‌లో పని చేస్తున్నారు. వీరిద్దరూ తమ కుటుంబాలతో కలిసి తిరుపతికి వెళ్లేందుకు జగన్నాథపురం నుంచి ద్విచక్ర వాహనాలపై సత్తుపల్లి బస్టాండ్‌కు వస్తున్నారు. సింగరేణి బైపాస్ రోడ్‌లోని మహాలక్ష్మీ క్యాంప్ వద్ద ద్విచక్ర వాహనాలను రోడ్డు పక్కన నిలిపి మరో స్నేహితుడు ప్రదీప్‌కుమార్‌తో మాట్లాడుతుండగా ఖమ్మం నుంచి అశ్వారావుపేట వైపు వెళ్తున్న గుర్తు తెలియని లారీ ద్విచక్రవాహనాలను ఢీకొట్టి వెళ్లిపోయింది. ఊకే రాజు, స్వరూపారాణిల కుమారుడు యశ్విత్ (4) అక్కడికక్కడే మృతిచెందాడు. మరో ద్విచక్ర వాహనంపై ఉన్న జి.సత్యభువన ప్రసాద్, రాజ్యలక్ష్మీల కుమార్తె నిహిత, ప్రదీప్‌కుమార్‌కు తీవ్రగాయాలయ్యాయి. వీరిని సత్తుపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం నిహిత, సత్యభువనప్రసాద్, రాజ్యలక్ష్మిని రాజమండ్రి ఆస్పత్రికి తరలించారు. ఎమ్మెల్యే మట్టా రాగమయి ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకుని బాధితులను ఓదార్చారు. సత్తుపల్లి ఎస్ఐలు రఘు, కవిత కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాయితేజ మృతదేహాన్ని తీసుకొచ్చేందుకు సంప్రదింపులు

ఖమ్మంవన్‌టౌన్: అమెరికాలో దుండగుల కాల్పుల్లో మృతిచెందిన నూకారపు సాయితేజ మృతదేహాన్ని భారత్‌కు రప్పించేందుకు ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి తీవ్రంగా కృషిచేస్తున్నారు. చికాగోలోని అమెరికా కాన్సులేట్ కార్యాలయం, తానా, ఎన్‌ఆర్‌ఐ సంఘాల ద్వారా సంప్రదింపులు జరిపారు. వీలైనంత త్వరగా సాయితేజ మృతదేహాన్ని భారత్ పంపాలని కోరారు.

జంట హత్య కేసులో అనుమానితుడి ఫొటోలు విడుదల

- కుటుంబసభ్యులనూ విచారించిన పోలీసులు ?



నేలకొండపల్లి లో పోలీసులు తనిఖీలు

నేలకొండపల్లి : జిల్లాలో జంట హత్య కేసుకు సంబంధించి అనుమానితుడి ఫొటోలను స్థానిక పోలీసులు విడుదల చేశారు. రెండు రోజుల క్రితం ఓ యువకుడు బైక్‌పై వచ్చి చెత్తకుప్పలో సెల్ పడేసిన దృశ్యాలు ఎదురుగా ఉన్న దుకాణంలోని సీసీ పుటేజీలో వెలుగుచూశాయి. దీంతో అర్ధరాత్రి సెల్‌ఫోన్‌ను చెత్త కుప్పలో పడేసిన ఆ యువకుడినే అనుమానిస్తున్నామని, ఆ వ్యక్తి లేదా బైక్‌కు గురించి తెలిస్తే సమాచారం ఇవ్వాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని స్థానిక ఎస్సై పి.సంతోష్ సోషల్ మీడియా ద్వారా ఆదివారం కోరారు. వీడియో, ఫొటోలను అన్ని గ్రామాలకు చెందిన వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ చేశారు. హత్య జరిగిన రెండు రోజుల తర్వాత సెల్ ఫోన్ అక్కడ వదిలేయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బైక్‌పై ఉన్నది నేలకొండపల్లికి చెందిన వ్యక్తి అనే ప్రచారం కావడంతో అతడెవరనేది స్థానికంగా చర్చంశనీయాంశమైంది.

అదుపులో అనుమానితులు...

దంపతుల హత్య కేసును చేధించేందుకు పోలీసులు దర్యాప్తులో వేగం పెంచారు. ఇప్పటికే పట్టణంలో ప్రతీ ఇంటికి తిరిగి అద్దెకు ఉండే వారి వివరాలు నమోదు చేసుకున్నారు. మృతులతో వ్యాపార పరంగా కానీ, వాహన డ్రైవర్లు, ఇతర వ్యవహారంలో కానీ తెలిసిన వారిని సైతం అదుపులోకి తీసుకుంటున్నారు. ఇప్పటికే అనేక మందిని అదుపులోకి తీసుకుని వివిధ కోణాల్లో విచారించారు. కాగా అనుమానితులను వివిధ పోలీస్‌స్టేషన్లకు తిప్పుతూ విచారణ చేస్తున్నట్లు సమాచారం. ఆదివారం మృతుల కుటుంబ సభ్యులను కూడా విచారించారు. హత్య కేసుకు సంబంధించిన పురోగతిపై ఖమ్మం సీపీ సునీల్ దత్ ఆరా తీశారు. ఎప్పటికప్పుడు దర్యాప్తు వేగవంతంగా పూర్తి చేసేందుకు సూచనలు, సలహాలు అందించారు.

చెరువులో పడి వ్యక్తి మృతి



సత్యనారాయణ (ఫైల్)

పెనుబల్లి: మండలంలోని కుప్పెనకుంట్ల గ్రామానికి చెందిన పడిగల సత్యనారాయణ (35) ఆదివారం ఉదయం ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. బయటకు వెళ్లిన సత్యనారాయణ ఎంతసేపటికీ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, చుట్టు పక్కలవారు గాలింపు చర్యలు చేపట్టారు. చెరువు గట్టు మీద సత్యనారాయణకు సంబంధించిన చెప్పులు, స్వెట్టర్ కనిపించడంతో స్థానికుల సాయంతో కుటుంబ సభ్యులు చెరువులో గాలించగా సత్యనారాయణ మృతదేహం చెరువులో లభ్యమైంది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రమాదం జరిగిన విధానాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుబల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించి, కేసు నమోదు చేశారు.

లారీ ఢీకొని ఫార్మసిస్ట్...



రామకృష్ణ (ఫైల్)

సత్తుపల్లిటౌన్: ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొని ఓ ప్రైవేట్ ఫార్మసిస్ట్ మృతి చెందిన ఘటన సత్తుపల్లిలో ఆదివారం చోటుచేసుకుంది. కల్లూరు మండలం నారాయణపురం గ్రామానికి చెందిన గొల్లమందల రామకృష్ణ (32) సత్తుపల్లిలోని ఓ ప్రైవేట్ మెడికల్ షాప్‌లో ఫార్మసిస్ట్‌గా పనిచేస్తున్నాడు. ద్విచక్ర వాహనంపై సత్తుపల్లి వస్తుండగా సింగరేణి బైపాస్‌రోడ్‌లోని కిష్టారం ఓపెన్ కాస్ట్ సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య రాజేశ్వరి, కుమార్తెలు ఆద్యా, అయాన్ష ఉన్నారు. ఎస్ఐ రఘు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా...

చిత్రహింసలు పెట్టి చంపేశారు

- ములుగు ఎన్‌కౌంటర్‌పై పౌరహక్కుల నేతల ఆరోపణ


ఎన్‌కౌంటర్ మృతుల ఫొటోలను ప్రదర్శిస్తున్న పౌర హక్కుల సంఘం నేతలు

సుల్తాన్‌బజార్ (హైదరాబాద్): ములుగు ఎన్‌కౌంటర్‌పై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని తెలంగాణ పౌర హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.నారాయణ రావు డిమాండ్ చేశారు. ఆయన ఆదివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 12 నెలల కాలంలో 16 మంది ఎన్‌కౌంటర్ పేరుతో చనిపోయారని తెలిపారు. ములుగులో మావోయిస్టుల శవాలు ఎన్‌కౌంటర్‌లో మృతి చెందినట్లు లేవని, చిత్రహింసలు పెట్టి కాల్చి చంపినట్లు ఉన్నాయని ఆరోపించారు. మావోయిస్టుల మృతదేహాలకు నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో శవ పరీక్షలు చేసి, ఏటూరు నాగారం ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న పోలీసులపై హత్యానేరం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాజకీయ ఖైదీల విడుదల కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బల్లా రవీంద్రనాథ్, పీడీఎస్ నేత చంద్రమౌళి పాల్గొన్నారు.

ఇన్‌ఫార్మర్ నెపంతో గిరిజనుడి హత్య

చర్ల: పోలీస్ ఇన్‌ఫార్మర్ నెపంతో ఒక గిరిజనుడిని మావోయిస్టులు హతమార్చిన సంఘటన ఆదివారం వెలుగుచూసింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా బైరంఘడ్ పోలీస్ స్టేషన్ పరిధి దలేర్‌కు చెందిన కుమ్మేశ్ కుంజమ్‌ను రెండు రోజుల క్రితం మావోయిస్టులు కిడ్నాప్ చేశారు. అతని గొంతుకోసి హతమార్చి మృతదేహాన్ని చితక్ టిండోడీ సమీపంలోని ప్రధాన రహదారిపై పడవేశారు. పోలీసు ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరిస్తున్నందువల్లే హతమార్చామంటూ మావోయిస్టు పార్టీ బైరంఘడ్ ఏరియా కమిటీ పేరిట మృతదేహం వద్ద లేఖ వదిలారు.

దండకారణ్యం నుంచి సరిహద్దుకు?

ఇటీవలి కాలంలో ఆ ప్రాంతంలో యుద్ధ వాతావరణం

మావోయిస్టులు రాష్ట్ర సరిహద్దులోకి వచ్చే అవకాశం ఉందన్న ఎస్ఐబీ

- పలువురు ఎస్పీలు, యాంటీ నక్సల్స్ ఆపరేషన్ బృందాలతో డీజీపీ భేటీ
- ఆ తర్వాతే వాజేడులో ఇద్దరు ఇన్‌ఫార్మర్లను హత్య చేసిన మావోయిస్టులు
- తాజా ఎన్‌కౌంటర్‌తో ఎస్ఐబీ అంచనా నిజమని తేలిన వైనం
- రాష్ట్రంలో సంచరిస్తున్న 15 మందిలో 14 మంది మృతి!



సాక్షి ప్రతినిధి, వరంగల్/సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం/మంథని/ సాక్షి హైదరాబాద్: దండకారణ్యం నుంచి మావోయిస్టు సాయుధ దళాలు సేఫ్టీ జోన్‌గా భావిస్తున్న తెలంగాణ సరిహద్దుకు వచ్చాయా? ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర సరిహద్దుల్లో ఉద్యమాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నవారు దండకారణ్యం వీడుతున్నారా? పారా మిలటరీ, యాంటీ మావోయిస్టు స్క్వాడ్స్, కేంద్ర సాయుధ బలగాల మోహరింపు, తీవ్రమైన నిర్బంధం నేపథ్యంలో ఎత్తుగడలలో భాగంగా తెలంగాణ సరిహద్దుకు చేరుకున్నారా? రాష్ట్రంలో కార్యకలాపాలు నిర్వహించాలనుకున్నారా? అంటే నిజమేనంటున్నాయి పోలీసు వర్గాలు. దండకారణ్యం విడిచి తెలంగాణకు చేరుకుని కార్యకలాపాలు నిర్వహించే క్రమంలోనే కీలక మావోయిస్టునేతలు కురుసం మంగు అలియాస్ భద్రు, పాపన్న, ఏగోలపు మల్లయ్య అలియాస్ కరుణాకర్, కోటి, మధు సహా ఏడుగురు మావోయిస్టులు మృత్యువాత పడినట్లు చెబుతున్నారు. రెండు నెలలుగా పోలీసులు, మావోయిస్టుల చర్యలు, ప్రతిచర్యలతో దండకారణ్యంలో యుద్ధవాతావరణం నెలకొన్న సంగతి తెలిసిందే. గతంలో ఎన్నడూ లేనివిధంగా కేంద్ర సాయిధ బలగాలు నారాయణపూర్ జిల్లా అబూజ్‌మఢ్ దండకారణ్యంలోకి చొచ్చుకు పోగా.. ఈ క్రమంలో జరిగిన వరుస ఎన్‌కౌంటర్లలో 254 మంది వరకు మృతి చెందినట్లు ఇటీవల మావోయిస్టు పార్టీ ప్రకటించింది.

ముందే పసిగట్టిన ఎస్ఐబీ..

2026 నాటికి మావోయిస్టుల అంతమే లక్ష్యమని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రకటించిన నేపథ్యంలో పోలీసు బలగాల చర్యలు అదేస్థాయిలో కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో వ్యూహం మార్చిన మావోయిస్టు అగ్రనేతలు, సాయధ దళాలు దండకారణ్యం నుంచి తెలంగాణ సరిహద్దులోకి ప్రవేశించే అవకాశం ఉందని స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) అంచనా వేసింది. రాష్ట్ర పోలీసులను అప్రమత్తం చేసింది. ఈ క్రమంలోనే ఈనెల 11న తెలంగాణ డీజీపీ జితేందర్.. జేఎస్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీలు, ఓఎస్డీలు, యాంటీ నక్సల్స్ ఆపరేషన్ బృందాల ఇన్‌చార్జిలతో సమావేశమై పలు సూచనలు చేశారు. ఇది జరిగిన పది రోజులకు మావోయిస్టులు ములుగు జిల్లా వాజేడులో పంచాయతీ కార్యదర్శి ఉయికే రమేష్, ఉయికే అర్జున్‌లను ఇన్‌ఫార్మర్ల పేరిట హత్య చేశారు. అనంతరం రాష్ట్రంలో భారీ ఎన్‌కౌంటర్ సైతం చోటు చేసుకోవడంతో ఇంటెలిజెన్స్ వర్గాల అంచనా నిజమని తేలింది. మావోయిస్టు అగ్ర నాయకత్వంలో ఉన్న పలువురు తెలుగు రాష్ట్రాల నాయకుల్లో కొందరు ఆరోగ్య సమస్యలతో ఉన్నట్టు సమాచారం. దీంతో పాటు తమకు దశాబ్దాలుగా సేఫ్‌జోన్లుగా ఉన్న దండకారణ్యంలోని ఒక్కో స్థావరాన్ని కేంద్ర పారా మిలటరీ బలగాలు స్వాధీనం చేసుకుంటుండటంతో కొత్త ప్రదేశాలకు మకాంమార్చే యోచనలో భాగంగా మావోయిస్టు దళాలు సరిహద్దుకు చేరాయని తెలుస్తోంది.

ఉనికి ఉన్నట్టుగా లేఖలు

ఇటీవలి కాలంలో రాష్ట్రంలో దళాల సంచారం లేకున్నా వివిధ ఏరియా కమిటీల పేరిట తరచుగా లేఖలు విడుదల చేస్తూ వచ్చారు. సాధారణంగా తెలంగాణ రాష్ట్ర కమిటీ, అల్లూరి సీతారామరాజు – భద్రాద్రి కొత్తగూడెం (ఏఎస్ఆర్‌బీకే) డివిజన్ కమిటీల పేర్లతో లేఖలు వస్తుంటాయి. ఆ తర్వాత మంచిర్యాల – పెద్దపల్లి – భూపాలపల్లి–ములుగు జిల్లాల డివిజన్ పేరిట కూడా లేఖలు వచ్చేవి. కానీ 2023 రెండో అర్ధభాగం నుంచి 2024 తొలి అర్ధభాగం వరకు పాల్వంచ – మణుగూరు, ఇల్లెందు – నర్సంపేట, సింగరేణి, చర్ల – శబరి తదితర ఏరియా కమిటీల పేర్లతో లేఖలు రావడం ఎక్కువైంది. తద్వారా తెలంగాణలో తమ ఉనికి ఉన్నట్టుగా చాటుకునేందుకు మావోయిస్టులు ప్రయత్నించారు.

తుడిచిపెట్టుకుపోయిన లచ్చన్న, భద్రు దళాలు

వివిధ కమిటీల పేర్లతో లేఖల జారీల అనంతరం జూన్‌లో మావోయిస్టులు గోదావరి తీరం దాటి తెలంగాణలోకి వచ్చినట్టు గట్టిగా ప్రచారం జరిగింది. దీనికి తగ్గట్టుగానే ములుగు – భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల సరిహద్దులో గుండాల మండలం దామెరతోగు అడవుల్లో జూలై 25న జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఒక మావోయిస్టు చనిపోయాడు. ఈ కాల్పులపై పోలీసులు స్పందిస్తూ.. నిషేధిత మావోయిస్టు పార్టీకి చెందిన భద్రు, లచ్చన్నతో పాటు దాదాపు 15 మంది మావోయిస్టులు ఆయుధాలతో సంచరిస్తున్నట్టు సమాచారం అందిందని, ఈ మేరకు చేపట్టిన కూంబింగ్.. ఎదురు కాల్పుల్లో ఒకరు చనిపోయారని ప్రకటించారు. కాగా భద్రాద్రి జిల్లా కరకగూడెం మండలంలో సెప్టెంబర్ 5న జరిగిన ఎన్‌కౌంటర్‌లో పాల్వంచ– మణుగూరు ఏరియా కమిటీ కార్యదర్శి లచ్చన్నతో పాటు మరో ఐదుగురు మావోయిస్టులు చనిపోయారు. ఒక మావోయిస్టు తప్పించుకున్నట్టు పోలీసులు తెలిపారు. దీంతో ముందుగా పేర్కొన్న 15మందిలో మొత్తం ఏడుగురు చనిపోయినట్టయ్యింది. లచ్చన్న దళం తుడిచిపెట్టుకు పోయినా భద్రు అలియాస్ మంగు దళం జాడ పట్టుకోవడం పోలీసులకు సవాల్‌గా మారింది. అయితే తాజాగా ములుగు జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మరణించడంతో భద్రు దళం మొత్తం హతమైంది.

భారీ నష్టం..

తాజా జరిగిన భారీ ఎన్‌కౌంటర్ మావోయిస్టు పార్టీకి పెద్ద దెబ్బేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇటీవల రఘునాథపాలెంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో భద్రాద్రి కొత్తగూడెం –అల్లూరి సీతారామరాజు డివిజన్ కమిటీ సభ్యులలో లచ్చన్న, లచ్చన్న సతీమణి తులసి అలియాస్ పునెం లక్కీ, పాల్వంచ మణుగూరు ఏరియా కమాండర్ కామ్రేడ్ రాము, పార్టీ సభ్యులు కోసి, సీనియర్ సభ్యులు గంగాల్, కామ్రేడ్ దుర్గేశ్ మరణించిన విషయం తెలిసిందే. కాగా ములుగు ఎన్‌కౌంటర్‌లో రాష్ట్ర కమిటీ, జిల్లా కమిటీతోపాటు తెలంగాణ క్యాడర్‌కు చెందిన యువ మావోయిస్టులు చనిపోవడం మావోయిస్టులకు తీరని నష్టమేనని అంటున్నారు. ఇటీవల దంతెవాడ–బీజాపూర్ జిల్లాల సరిహద్దులో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు, మావోయిస్టు తొలితరం అగ్రనాయకుడు మాచర్ల ఏసోబు అలియాస్ జగన్ మృతిచెందిన విషయం తెలిసిందే. అదేవిధంగా ఈ ఏడాది ఏప్రిల్‌లో ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేరు జిల్లాలో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో 29 మంది మావోయిస్టులు సహా మావోయిస్టు అగ్రనేత, దండకారణ్యం స్పెషల్ జోన్ కమిటీ, ఆర్‌కేబీ డివిజన్ కమిటీ కార్యదర్శి సుగులూరి చిన్నన్న, అలియాస్ విజయ్, అలియాస్ శంకర్‌రావు హతమైన విషయం కూడా తెలిసిందే.

ములుగు అడవుల్లో భారీ ఎన్‌కౌంటర్

▶ మొదటి పేజీ తరువాయి


కుర్సం మంగు


ముస్సాకి దేవల్


ముస్సాకి జమున

కాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందారు. మిగతా వారు పారిపోగా ఘటన స్థలంలో రెండు ఏకే–47 రైఫిళ్లు, ఒక జీ–6, ఒక ఇన్సాస్, 303 రైఫిళ్లు, మందుగుండు సామగ్రి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతులను తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు, ఇల్లందు, నర్సంపేట ఏరియా కమిటీ కార్యదర్శి కుర్సం మంగు అలియాస్ భద్రు, పాపన్న (35), దండకారణ్యం డివిజన్ కమిటీ సభ్యుడు, ఏటూరునాగారం–మహదేవపూర్ ఏరియా కమిటీ కార్యదర్శి ఏగోలపు మల్లయ్య అలియాస్ మధు, కోటి, కమలాకర్ (43), ఏరియా కమిటీ సభ్యులు ముస్సాకి దేవల్ అలియాస్ కరుణాకర్ (22), ముస్సాకి జమున (23), పార్టీ సభ్యులు జైసింగ్ (25), కిషోర్ (22), కామేష్ (23)గా పోలీసులు గుర్తించారు. ఏగోలపు మల్లయ్యది తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం రాణాపూర్ గ్రామం కాగా, మిగతా ఆరుగురు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన వారు.

తొమ్మిదేళ్ల తర్వాత ఎన్‌కౌంటర్

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో పాగా వేసేందుకు మావోయిస్టులు ప్రయత్నాలు చేసినప్పటికీ ఆటంకాలు ఎదురయ్యాయి. అయితే 2015 సెప్టెంబర్ 15న ములుగు జిల్లా వెంగళాపూర్ అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హనుమకొండ వడ్డేపల్లికి చెందిన ఎంటెక్ విద్యార్థి తంగళ్లపెల్లి శ్రుతి అలియాస్ మహిత, వరంగల్ జిల్లా ధర్మసాగర్ మండలం పెండ్యాలకు చెందిన మణికంటి విద్యాసాగర్‌రెడ్డి అలియాస్ సాగర్ మరణించారు. అప్పట్నుంచి సుమారు తొమ్మిదేళ్ల తర్వాత ఆదివారం భారీ ఎన్‌కౌంటర్ జరగడం కలకలం రేపుతోంది. మావోయిస్టు పార్టీ సాయుధ విభాగం పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పీఎల్‌జీఏ) ఏర్పడి 24 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ నెల 2వ తేదీ నుంచి 8వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహించాలని మావోయిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ రెండురోజుల క్రితమే పిలుపునిచ్చింది. ఈ మేరకు వారోత్సవాలకు సన్నద్ధమవుతున్న సమయంలో భారీ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుని ఏకంగా ఏడుగురు మావోయిస్టులు మృతి చెందడం ఆ పార్టీకి పెద్ద ఎదురుదెబ్బగా భావిస్తున్నారు.

33 ఏళ్ల తర్వాత మళ్లీ వార్తలకెక్కిన చెల్పాక

తాజా ఎన్‌కౌంటర్‌తో చెల్పాక పేరు 33 ఏళ్ల తర్వాత మళ్లీ వార్తలకెక్కింది. 1991 జూన్ 21న అప్పటి పీపుల్స్‌వార్, ఇప్పటి మావోయిస్టు పార్టీ నక్సలైట్లు భారీ మందుపాతర పేల్చారు. ఈ ఘటనలో ఏటూరునాగారం సీఐ సంతోష్‌కుమార్, ఎస్ఐ కిషోర్‌కుమార్ సహా ఏడుగురు సీఆర్‌పీఎఫ్ పోలీసులు మరణించారు. రాజీవ్‌గాంధీ మరణానంతరం జరిగిన పార్లమెంటు ఎన్నికల పోలింగ్ రోజునే గ్రామ సమీపాన నక్సలైట్లు ఈ ఘటనకు పాల్పడ్డారు. చెల్పాక పోలింగ్ కేంద్రంలోని బ్యాలెట్ బాక్సుల్లో సిరా పోసి, పథకం ప్రకారం పోలీసులకు సమాచారం చేరవేసి రప్పించిన నక్సల్స్.. ఈ భారీ మందుపాతర పేల్చారు. అదే చెల్పాక సమీప అడవుల్లో తాజాగా జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందడం చర్చనీయాంశంగా మారింది.

కొనసాగుతున్న కూంబింగ్

భారీ ఎన్‌కౌంటర్ పల్లెల్లో కలకలం రేపింది. ఇన్‌ఫార్మర్ల పేరిట వాజేడులో ఇద్దరి హత్య, ఆదివారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌తో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఎన్‌కౌంటర్ తర్వాత కూడా పోలీసు బలగాల కూంబింగ్ కొనసాగుతూనే ఉంది. పీఎల్‌జీఏ వారోత్సవాలను భగ్నం చేసేందుకు గొత్తికోయ గూడేలు, అటవీ ప్రాంతాలు, మారుమూల గ్రామాల్లో జల్లెడ పడుతున్నారు.

మృతుల వివరాలు.. లభ్యమైన ఆయుధాలు

1.కుర్సం మంగు: గొత్తికోయ. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా చేరమంగి గ్రామం. తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు, ఇల్లందు–నర్సంపేట ఏరియా కమిటీ కార్యదర్శి. ఇతని వద్ద లభ్యమైన ఆయుధం ఏకే–47.

2.ఏగోలపు మల్లయ్య: పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం రాణాపూర్ గ్రామం. తెలంగాణ, డివిజన్ కమిటీ సభ్యుడు, ఏటూరునాగారం–మహదేవపూర్ ఏరియా కమిటీ కార్యదర్శి. ఇతని వద్ద కూడా ఏకే–47 లభ్యమైంది.

3.ముస్సాకి దేవల్: గొత్తికోయ. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా ఉసూర్ గ్రామం. ఇతని వద్ద జీ3 రైఫిల్ లభ్యమైంది.

4.ముస్సాకి జమున: గొత్తికోయ. ఛతీస్‌గఢ్ రాష్ట్రం బైరామ్‌ఘర్ గ్రామం.

5.జైసింగ్: పార్టీ సభ్యుడు. ఇంద్రావతి ప్రాంతం. లభ్యమైన ఆయుధం.303 రైఫిల్.

6.కిషోర్: పార్టీ సభ్యుడు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా గంగులూరు పీఎస్ పరిధి పాంపాడ్ గ్రామం. లభ్యమైన ఆయుధం ఇన్సాస్ రైఫిల్.

7. కామేష్: పార్టీ సభ్యుడు. ఛతీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా ఉసూర్ పీఎస్ పరిధి మలంపెంట గ్రామం. లభ్యమైన ఆయుధం ఎస్‌బీబీఎల్ గన్.

జిల్లా వార్తలు

సభ్యులు తిన్నాకే విద్యార్థులకు..

- పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అమలులో నిబంధనలు
- నాణ్యత పరిశీలన, తనిఖీలకు ప్రత్యేక కమిటీలు
- అన్ని పాఠశాలల్లో నియమించాలని విద్యాశాఖ ఆదేశం
- నాసిరకం భోజనానికి చెక్ పెట్టేలా చర్యలు


సింగారెడ్డిపాలెంలో వంటలను పరిశీలిస్తున్న అధికారులు

నేలకొండపల్లి: రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో ఇటీవల భోజన లోపాలతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యాన ఎక్కడా సమస్య రాకుండా, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేలా ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందుకోసం ప్రభుత్వ పాఠశాలల్లో ఆహార కమిటీలను నియమించాలని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ కమిటీల్లో ప్రధానోపాధ్యాయుడు కన్వీనర్‌గా, ఉపాధ్యాయులు సభ్యులుగా ఉంటారు. ఈ మేరకు ప్రతిరోజూ వారు భోజనం చేశాక విద్యార్థులకు వడ్డించాలనే నిబంధన విధించారు. తద్వారా భోజనంలో నాణ్యత పెరుగుతుందని.. లోపాలు ఉంటే సరిదిద్దే అవకాశం లభిస్తుందని భావిస్తున్నారు.

నాణ్యత లేకుంటే వెనక్కి..

ప్రభుత్వ వసతి గృహాలు, పాఠశాలలు, గురుకుల పాఠశాలల్లో హెచ్ఎం, ఉపాధ్యాయులతో కలిపి ముగ్గురితో కూడిన ఆహార కమిటీల నియామకం చివరి దశకు చేరింది. వీరు మధ్యాహ్న భోజనానికి వినియోగించే సరుకుల పరిశీలనలో కీలకంగా వ్యవహరించాల్సి ఉంటుంది. బియ్యం సహా ఏ సామగ్రి అయినా సరే ఏజెన్సీ నిర్వాహకులు ఇష్టానుసారంగా తీసుకురాకుండా పర్యవేక్షించాలి. సరుకుల్లో నాణ్యత ఉంటేనే అనుమతించాలని, లేకపోతే తిప్పి పంపాలని స్పష్టమైన ఆదేశాలు అందాయి. అంతేకాక మధ్యాహ్న భోజనం తయారీకి వాడుతున్న బియ్యంతో పాటు కారం, అల్లం, వెల్లుల్లి, కూరగాయలు, నూనె ఇలా ప్రతీది నాణ్యతగా ఉందా, లేదా అని కూడా పరిశీలించాలి. ఆపై వంట చేసే ప్రదేశం శుభ్రంగా ఉండేలా చూసుకోవాలి. కాగా, ప్రతి రోజూ వంట చేసే సమయంలో ఫొటోలు తీసి విద్యాశాఖ యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఆపై కమిటీ సభ్యులు భోజనం చేసి అంతా బాగుందని నిర్ధారించుకున్నాకే విద్యార్థులకు వడ్డించాలి. ఈ కమిటీలను ప్రభుత్వ పాఠశాలలతో పాటు కేజీబీవీలు, గురుకుల పాఠశాలలు, ఆదర్శ పాఠశాలలో వెంటనే ఏర్పాటుచేయాలని అధికారులు సూచించారు. ఈ కమిటీతో పాటు మండల స్థాయిలో వివిధ శాఖల అధికారులు సైతం నిరంతరం పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. అదే విధంగా ప్రతీ బుధవారం విద్యార్థులతో కలిసి భోజనాలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

కమిటీల బాధ్యతలివే..

- ప్రతీరోజు వంట గదుల్లో పరిశీలించాలి. నాణ్యమైన కూరగాయాలు వస్తున్నాయా, లేదా అని తనిఖీ చేయాలి.
- వంటకు ఉపయోగించే ఇతర దినుసులు కూడా నాణ్యమైనవేనా.. ఉపయోగానికి గడువు ఉందా అని పరిశీలించాలి.
- ఉపాధ్యాయులు తిన్న తర్వాతే విద్యార్థులకు భోజనం వడ్డించాలి.
- టీచర్లు భోజనం చేశాక రుచిపై అభిప్రాయాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలి.
- రుచి బాగుందా, లేదా అనే విషయంపై విద్యార్థుల అభిప్రాయాలు తీసుకుని రిజిస్టర్‌లో సంతకాలు చేయించాలి.
- వంటలను పాఠశాలలోనే చేయించాలి. ఏజెన్సీ బాధ్యులు ఇంటి వద్ద వండుకుని తీసుకొస్తే నిరాకరించాలి.
- ఏజెన్సీ నిర్వాహకులు శుభ్రత పాటించేలా చర్యలు తీసుకోవాలి.
- పాఠశాలలోని వంట గదిలో, కార్యాలయంలో మెనూ చార్ట్ ఏర్పాటు చేయాలి.
- ఆహార కమిటీ బాధ్యుల పేర్లు, ఫోన్ నంబర్లు సైతం చార్ట్‌లో నమోదు చేయాలి.

నిబంధనలు పాటించకుంటే చర్యలు



ప్రభుత్వ నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి. కమిటీ సభ్యులు తిన్న తర్వాతే విద్యార్థులకు వడ్డించాలి. ఈ నిబంధనల అమలును తరచుగా పర్యవేక్షిస్తాం.

– ఎం.యర్రయ్య, ఎంపీడీఓ, నేలకొండపల్లి

అన్ని పాఠశాలల్లో కమిటీలు



విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించడమే లక్ష్యంగా ప్రభుత్వ ఆదేశాలతో పాఠశాలల్లో ఆహార కమిటీలు ఏర్పాటు చేశాం. వంట గది, ఆఫీస్ రూమ్‌లో మెనూ, కమిటీ వివరాలతో చార్ట్‌లు ఉంటాయి.

– బి.చలపతిరావు, ఎంఈఓ, నేలకొండపల్లి

విద్యార్థులకు మేలు జరుగుతుంది..



ప్రభుత్వ పాఠశాలలో ఆహార కమిటీలను ఏర్పాటుచేయడం మంచి నిర్ణయం. ఉపాధ్యాయులు తిన్నాకే విద్యార్థులకు వడ్డిస్తే లోపాలు తెలిసిపోతాయి. విద్యార్థుల ఆరోగ్యానికి భరోసా ఉంటుంది.

– జి.మస్తాన్, విద్యార్థి సంఘం నాయకులు, నేలకొండపల్లి

కిన్నెరసానిలో పర్యాటకుల సందడి

ఒకరోజు ఆదాయం రూ.31,135


జలాశయంలో బోటింగ్ చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కిన్నెరసానిలో పర్యాటకులు ప్రకృతి అందాలను తిలకించి సందడి చేశారు. జిల్లా నలుమూలలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి సైతం ఆదివారం పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా డ్యామ్ పై నుంచి జలాశయాన్ని, డీర్‌పార్కులోని దుప్పులను వీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహాలతో గడిపారు. 475 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.16,875, 300 మంది బోట్ షికారు చేయడంతో పర్యాటకాభివృద్ధి సంస్థకు రూ.14,260 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు వెల్లడించారు.

సొంత అవసరాలకు అంబులెన్స్‌లు

- సింగరేణి మణుగూరు ఏరియాలో కరువైన పర్యవేక్షణ
- బ్రేక్‌డౌన్ సమయాన సైతం బిల్లులు?


మణుగూరు ఏరియా ఆస్పత్రి

మణుగూరు టౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని అంబులెన్స్‌లను కొందరు సొంత అవసరాలకు ఉపయోగించుకుంటున్నారనే విమర్శలు వస్తున్నాయి. కార్మికులు ఆపదలో ఉన్న సమయాన వాడాల్సిన అంబులెన్స్‌లు కొందరు చిన్న చిన్న, వ్యక్తిగత పనులకు వాడుతున్నట్లు సమాచారం. వాహనాల నిర్వహణపై పర్యవేక్షణ కరువవడంతో ఈ పరిస్థితి నెలకొందని తెలుస్తోంది. చిన్న చిన్న పార్సిళ్లే కాక రెస్టారెంట్ల నుంచి బిర్యానీలు తీసుకురావడానికి, వ్యక్తిగత పనులకు 10 నుంచి 25 కిలోమీటర్ల మేర అంబులెన్స్‌లను పంపిస్తూ సొంత వాహనాలుగా వినియోగించుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అంతేకాక ఇటీవల మణుగూరులో జరిగిన ఓ వేడుకకు సామగ్రిని సైతం అంబులెన్స్‌ల్లోనే తరలించినట్లు సమాచారం.

పర్యవేక్షణ లోపించడంతో..

మణుగూరు ఏరియాకు మొత్తం ఏడు అంబులెన్స్‌లు ఉండగా మూడు మైన్లపై, మరో మూడు ఏరియా ఆస్పత్రికి కేటాయించారు. ఇంకో వాహనం మార్చురీ వాహనంగా ఏరియా ఆస్పత్రిలో అందుబాటులో ఉంచారు. ఇందులో ఏసీ సౌకర్యం కలిగిన ఓ వాహనంలో ఏసీ పనిచేయక ఐదు నెలలు దాటిందని సమాచారం. అయినప్పటికీ వాహనం తిరుగుతోందని బిల్లులు పెడుతున్నట్లు తెలిసింది. అలాగే, ఓ అంబులెన్స్ బ్రేక్‌డౌన్‌తో 15 రోజులు నిలిచిపోయి ఆ తర్వాత అందుబాటులోకి వచ్చింది. అయితే, మరమ్మతు కోసం పక్కన పెట్టిన సమయంలోనూ తిరిగినట్లు బిల్లులు చేయిస్తున్నారని సమాచారం. ఇదంతా పర్యవేక్షించాల్సిన అధికారి ఒకరు కొత్తగూడెంలో ఓ వేడుకకు అంబులెన్స్‌లో వెళ్తూ కంపెనీ పనిపై వెళ్లినట్లు రికార్డుల్లో పొందుపర్చినట్లు తెలిసింది. కార్మికులకు అత్యవసర సమయాల్లో సేవలందించాల్సిన వాహనాలను దుర్వినియోగం చేస్తున్న నేపథ్యాన ఉన్నతాధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై డీవైసీఎంఓ మేరీకుమారిని వివరణ కోరగా... తాను సెలవులో ఉండగా, ఇన్‌చార్జిగా ఓ డాక్టర్ వ్యవహరిస్తున్నారని తెలిపారు. అయినా తాను అంబులెన్స్‌ల వ్యవహారాన్ని పెద్దగా పట్టించుకోనని, ఎవరైనా ఫిర్యాదు చేస్తే పరిశీలించి చర్యలు తీసుకుంటానని చెప్పడం గమనార్హం. దీనిపై ఏరియా జీఎం దుర్గం రాంచందర్‌ను వివరణ కోరగా.. అంబులెన్స్‌లు తరచూ నిలిచిపోవడం, సొంత వాడకాలకు వినియోగించడాన్ని ఉపేక్షించబోమని చెప్పారు. అంబులెన్స్‌లను జీఎం ఆఫీస్‌కు, మెడిసిన్ తీసుకురావడానికి మాత్రమే వినియోగిస్తారని, మిగతా సందర్భాల్లో కార్మికుల సేవల కోసమే అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. అంబులెన్స్‌లు ఎప్పుడూ ఫిట్‌గా ఉండాలని, లేదంటే టెండర్ రద్దు చేస్తామని స్పష్టం చేశారు.

రూ.100 పార్సిల్‌కు రూ.400 డీజిల్

ఏరియా ఆస్పత్రికి వివిధ ప్రాంతాల నుంచి మందులు, ఇతర సామగ్రి వస్తుంటాయి. ఇల్లెందు, కొత్తగూడెం తదితర ప్రాంతాల నుంచి మణుగూరు ఆస్పత్రికి వచ్చే చిన్నచిన్న పార్సిళ్లు తీసుకురావడానికి కూడా ఖాళీగా ఉంటుందనే నెపంతో అంబులెన్స్‌లు వాడుతున్నారని తెలుస్తోంది. ఈ కారణంగా రూ.100 కూడా విలువ చేయని పార్సిళ్లు తీసుకొచ్చి రూ.400 డీజిల్ వాడినట్లు బిల్లులు సమర్పిస్తున్నారని సమాచారం. అంతేకాకుండా బిర్యానీ, కర్రీలు తీసుకురావడానికి హోటళ్లకు, డాక్టర్ల నివాసాల్లో ల్యాప్‌టాప్‌లు, ఇతర సామగ్రి పాడైతే మరమ్మతులకు చేయించడానికి అంబులెన్స్‌ల్లోనే పంపిస్తున్నారని సమాచారం.

పనిముట్లు లేకుండానే పనులు..

- సింగరేణిలో సివిల్ కాంట్రాక్టు కార్మికుల ఇక్కట్లు
- కాంట్రాక్టర్ల తీరును పట్టించుకోని అధికారులు


కొత్తగూడెం ఏరియాలో కార్మికుల హాజరు నమోదు చేస్తున్న సూపర్‌వైజర్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ కొత్తగూడెం ఏరియాలో సివిక్ పనులు చేసే కాంట్రాక్ట్ కార్మికులకు పనిముట్ల కొరత ఏర్పడింది. సంస్థ వ్యాప్తంగా ఉన్న 11 ఏరియాల్లో గతంలో పర్మనెంట్ కార్మికులు సివిక్ పనులు చేసేవారు. వీరికి అవసరమైన పనిముట్లు అయిన చీపురు, పారలు, కొడవళ్లు వంటివి కంపెనీనే సమకూర్చేది. అయితే, కార్మికుల వేతనాలు ఎక్కువగా చెల్లించాల్సి వస్తుందని వారిని తొలగించగా.. కాంట్రాక్ట్‌కు ఇచ్చారు. ఒప్పందం సమయంలోనే కార్మికులకు సామగ్రి కూడా కాంట్రాక్టరే సమకూర్చాలని నిబంధన విధించారు. కానీ పనిముట్లు ఇవ్వకుండా కాంట్రాక్టర్ పనులు చేయాలని ఒత్తిడి చేస్తుండగా.. కార్మికులు సొంతంగా తెచ్చుకోవడమో లేదంటే అద్దెకు తీసుకురావడమో చేయాల్సి వస్తోంది. రూ.కోట్ల విలువైన టెండర్లు పొందిన కాంట్రాక్టర్ కార్మికులకు పనిముట్లు ఇస్తున్నారా.. లేదా అని పర్యవేక్షించాల్సిన అధికారుల నిర్లక్ష్యంతోనే ఈ పరిస్థితి నెలకొందనే విమర్శలు వస్తున్నాయి. ఇక కాలనీల్లో చెత్తా చెదారం తొలగించాక దుర్వాసన రాకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లించాలి. ఈ నిబంధన కూడా ఒప్పందంలో ఉన్నప్పటికీ కాంట్రాక్టర్ పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇవన్నీ పక్కన పెడితే కార్మికులు మధ్యాహ్న భోజనం చేయడానికి కనీస వసతి కల్పించకపోగా తాగునీరు కూడా సమకూర్చడం లేదు. ఇవన్నీ తెలిసినా అధికారులు పట్టించుకోకపోగా.. కార్మిక సంఘాల నాయకులు సైతం నోరెత్తకపోవడం విమర్శలకు తావిస్తోంది.

నిబంధనల కంటే ఎక్కువ మంది...

సింగరేణి సంస్థ కాలనీల్లో పారిశుద్ధ్య పనులు చేయడానికి నిర్దిష్ట సంఖ్యలో కార్మికులను నియమించుకోవాలని టెండర్ ప్రక్రియ చేపడుతుంది. ఈమేరకు నిబంధనల ప్రకారం 30 మంది కార్మికులను నియమించుకోవాల్సి ఉన్నా కాంట్రాక్టర్లు సింగరేణిలో ఉద్యోగాల పేరిట డబ్బులు వసూలు చేసి అదనంగా నియమిస్తున్నారని సమాచారం. ఫలితంగా కొంతకాలంగా పనిచేస్తున్న కార్మికులకు నెలనెలా 26 మస్టర్లకు బదులు ఆరు నుంచి పది వరకు తగ్గుతున్నాయి. దీంతో వారు వేతనం కోల్పోవాల్సి వస్తోంది. ఈ విషయం కూడా ఏరియా ఉన్నతాధికారులకు తెలిసినా చూసీచూడనట్లు వదిలేస్తున్నారని సమాచారం. అలా కాకుండా ఇకనైనా రొటేషన్ విధానానికి స్వస్తి పలికి.. తమకు 26 మస్టర్లు కేటాయించడంతో పాటు పనిముట్లు సరఫరా చేయాలని కాంట్రాక్టు కార్మికులు కోరుతున్నారు.